## సింగిల్ పేజీ కథ

# మానవత్వం

"మూర్తీ! కారు కొంచెం ఆపు. ఆ ముందు ఏదో ఏక్సిడెంటయినట్లుంది" అన్నాడు రామారావు.

కృష్ణమూర్తి కారు ఆపలేదు కానీ, కొద్దిగా స్లో చేసాడు.

బహుశా అప్పుడే కొంచెం ముందు జరిగి నట్లు ఉంది ఏక్సిడెంట్. మోటర్ సైకిల్ ఓ పక్కకి ఒరిగి ఉంది తుక్కుతుక్కై. ప్రక్కనే గాయాలతో స్పృహ లేకుండా పడి ఉన్నాడు ఓ వ్యక్తి. బహుశా ఏదో లారీ గుద్ది ఉంటుంది.

"మనం యిప్పుడు కారు ఆపి యిలాంటి వాటిలో తలదూర్చితే మనకే లేనిపోని తలనొప్పి, కష్టనష్టాలు కూడా! అంతేకాకుండా అనవసరంగా కేసుల్లో యిరుక్కు పోవలసి వస్తుంది. పైగా మనం వేగం సిటీ చేరితే రెస్టు తీసుకొని, రేపు మీటింగ్ కళ్లే ఏర్పాట్లు చూడొచ్చు. మనం ఆ ఏక్సిడెంట్ జరిగిన అతన్ని తీసుకొని వెళ్తే మనమే ఈ ఏక్సిడెంట్ చేసి ఉంటామని పోలీసులు భావించి మన మీదనే కేస్ బనాయించవచ్చు. పైగా మనం ఏక్సి డెంట్ చేయకపోతే, ఆస్పత్రిలో ఎందుకు జాయిన్ చేస్తామని పోలీసులు ప్రశ్న వేస్తారు. పుణ్యానికిపోతే పాపమెదురైనట్లు నా స్నేహితుడొకడు ఏం పాపం ఎరుగక పరోపకారానికి పోయి, యిలాగే యిరుక్కు న్నాడు. కేసులో చాలా డబ్బులొదిలాయి కూడా వాడికి" అన్నాడు కృష్ణమూర్తి కనీసం అటువైపు దృష్టి కూడా సారించకుండా.

అప్పటికే కారు దుర్ఘటన స్థలం దాటి వెళ్లిపో యింది.

"అయితే మాత్రం? సాటి మనిషిని ప్రాణాపా యస్థితిలో వదిలేసి వెళ్లడానికి మనసెలా ఒప్పుతుం దిరా? ఇలాగే అందరూ అనుకొని పట్టించుకోకుండా వెళ్లిపోతే ఆ మనిషి గతేంటి? ఓ నిండు ప్రాణం పోదా? ఇలాంటి సమయాల్లోనే మనిషికి తగిన సహాయం కావాలి. ఒక నిండుప్రాణం నిలపడం అంత సార్థకమైన పని యింకొకటి లేదు. కొంచెం కారు ఆపి వెనక్కు తిప్పు. రేప్పొద్దున్న మనకీ యిలాగైతే పట్టిం చుకునే వారెవరూ ఉండరు. పాపం ఎంత గాయాలై నాయో ఏమో, నా మాట విని వెనక్కు పోనీ" అన్నాడు రామారావు సానుభూతితో.

అయితే కృష్ణమూర్తి కారు ఆపకుండా ముందుకే పోనిస్తూ,

"నీకు చెప్పడం నాతరం కాదురా! ఆ పోలీసుల్తో, ఆస్పత్రి వాళ్లతో కూడా మనం పడలేంరా! ఏక్సిడెంట్ కేసులు ఏ క్లినిక్‌లోనూ చూడరు కూడా. తప్పనిసరై ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చాలి. వాళ్లు కూడా పోలీసులకి తెలియపర్చి, వాళ్లు వచ్చేకగానీ చూడరు. ఎందుకింత బాధ మనకి? పోనీ ఒక పని చేద్దాం. ముందుకేదైనా ఊర్లో టెలిఫోన్ బూత్ నుండి పోలీసులకి ఫోన్ చేసి తెలియబ రుద్దాం. వాళ్లే చూసుకుంటారు మిగతావన్నీ. సెల్ నుంచి మాత్రం వద్దు" అన్నాడు.

'అంతవరకూ బ్రతికుంటాడా' అని మనసులో సందే హపడినా, చేసేది లేక మౌనం వహించాడు రామారావు.

'కృష్ణమూర్తి ఎప్పుడూ ఇంతే! తన మాట వినడని' నిట్టూరుస్తూ అనుకున్నా, పోనీ ఫోనైనా చేస్తానన్నాడని



కాస్త స్థిమితపడ్డాడు.

ఓ రెండు కిలోమీటర్ల దూరం పోగా, ఓ టెలిఫోన్ బూత్ కనిపించగా, అక్కడ కారు ఆపి కృష్ణమూర్తి విషయం పోలీసులకి క్లుప్తంగా తెలియపర్చాడు.

కారు స్టార్ట్ చేస్తూ, "పోలీసులకి తెలియపర్చాం కదా! మన బాధ్యత తీరింది. వాళ్లే చూసుకుంటారు. నువ్వు కూడా యిట్లాంటి విషయాల్లో ఎప్పుడూ పెద్దగా కలుగజే సుకోకు. చాలా చిక్కులపాలవుతావు" అని ఓ ఉచిత సలహా కూడా యిచ్చాడు.

పోనీలే, ఫోనైనా చేశాడని స్వాంతన పొందాడు రామా రావు.

రామారావు, కృష్ణమూర్తి యిద్దరూ కొలీగ్స్. ఇద్దరూ ప్రవృత్తిలో భిన్నధృవాలైనా, మంచి స్నేహితులు. రేపు జర గబోయే ఆఫీస్ మీటింగ్‌కి కృష్ణమూర్తి కారులో బయలు దేరారిద్దరూ.

ఆ మరుసటిరోజు మీటింగ్‌లో ఉండగా కృష్ణమూర్తి సెల్‌కి ఫోన్ వస్తే మాట్లాడటానికి బయటికి వెళ్లాడు.

అయిదు నిమిషాల తర్వాత తిరిగి వచ్చి,

"ఇంటినుండి ఫోన్ వచ్చిందిరా, అర్జెం ట్‌గా వెళ్లాలి, మా బావగారికి ఏక్సిడెంట్ జరి గింది. కారు తీసుకొని వెళ్తున్నాను. నువ్వు బస్‌లో తిరిగి వచ్చేయ్! యింటికెళ్లాక మాట్లా డుకుందాం" అని రామారావుతో చెప్పి హడావుడిగా వెళ్లాడు మీటింగ్ నిర్వహిస్తున్న ఎం.డి. అనుమతి తీసుకో వడానికి.

ఆ మరునాడు, కృష్ణమూర్తిని కలవడానికి వాళ్లింటికి వెళ్లాడు రామారావు.

అప్పుడే ఎక్కడికో బయలుదేరబోతున్నవాడల్లా రామారావుని చూసి కృష్ణమూర్తి ఆగిపోయాడు.

"రా రా! నీ గురించే చూస్తున్నాను. మా బావగారికి ఏక్సిడెంట్ మనం మీటింగ్‌కి కారులో బయలుదేరిన రోజే జరిగింది. ఏక్సిడెంట్ జరిపిన ట్రక్ వాడు పట్టించుకో కుండా అతన్ని రోడ్డుమీద గాయాలతో వదిలేసి ఉడా యించాడట. చాలాసేపు అలాగే రోడ్డుమీద దిక్కు లేని స్థితిలో పడి ఉన్నాడట. ఆఖరికి పోలీసులు వచ్చి హాస్పిటల్‌లో చేర్చారట. తలకి బలమైన గాయాల య్యాయి. చాలా రక్తం పోయింది. సీరియస్ కండీష న్‌లో ఐ.సి.యు.లో ఉన్నాడతను ప్రస్తుతం" అన్నాడు కృష్ణమూర్తి.

"చూశావా! మొన్న మనం అక్కడ రోడ్డుమీద వదిలేసిన అతని పరిస్థితి అంతేమరి! అందుకే అలాంటి సమయాల్లో మానవత్వంతో సహాయప డాలి. మరే విధమైన నెగటివ్ ఆలోచనలు పెట్టుకో కుండా. మనం ఆరోజు ఆ స్థితిలో వదిలేసిన అతను కొంపదీసి మీ బావకాదు కదా, నువ్వు కారు ఆపలేదు సరికదా, అటువైపు చూడను కూడా లేదు. కానీ నాకింకా ఆ మోటర్ సైకిల్ నెంబరు గుర్తే" అని బండి నెంబరు చెప్పడంతో,

"అయ్యో! ఎంత పని జరిగింది. ఆ బండి అతనిదే. అనవసరంగా మనమే అతన్ని అతని ఖర్మకి వదిలేసాం. అప్పుడే అతన్ని పట్టించుకొని ఉంటే ఎంత బావుణ్ణు." అన్నాడు కృష్ణమూర్తి బాధగా, తప్పు చేసానన్న భావనతో మనోక్షోభకి గురౌతూ.

"చూసావా! అందుకే అన్నాను. మనకే యీ పరిస్థితి ఒకవేళ ఎదురైతే ఎలా అని. అందుకే ఎట్టి పరిస్థితుల్లో మానవత్వం విడవకూడదు" అన్న రామారావు మాటలు వింటూ ఉండిపోయాడు కృష్ణమూర్తి.

నెలరోజుల్లో కృష్ణమూర్తి బావగారు పూర్తిగా కోలుకు న్నాక కూడా అపరాధ భావన వదలలేదతన్ని. కనీసం ఫోన్ చేసి పోలీసులకి తెలియపర్చాం అన్న తృప్తి ఒక్కటే మిగి లింది చివరికి.

**-డి.వి.డి.ప్రసాద్ (బరంపురం)**